అదనపు టీఎంసీ పనుల్లో కదలిక.!

- పనులపై ఇద్దరు ఆర్డీవోల సమీక్ష
- ఎల్‌ఏవోగా మళ్లీ వేములవాడ ఆర్డీవో
- కొద్ది నెలలుగా ఆగిన పనులు
- కోర్టు కేసులు లేని చోట్ల పనులు
- అధికారుల వద్ద 35 చెక్కులు
- పంపిణీ అయినవి కొన్ని మాత్రమే


అదనపు టీఎంసీ పనులపై సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోల సమీక్ష

బోయినపల్లి: కాళేశ్వరం ప్రాజెక్టు మూడో టీఎంసీ వరద కాల్వ నిర్మాణం పనుల్లో మళ్లీ కదలిక మొదలైంది. పరిహారం విషయంలో పలువురు భూనిర్వాసితులు కోర్టును ఆశ్రయించడంతో కోర్టు విధించిన స్టేటస్‌కోతో ఆరు నెలలుగా అదనపు టీఎంసీ పనులు ఆగిపోయాయి. కాగా అదనపు టీఎంసీ పనులపై ఇటీవల సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవోలు శ్రీనివాసరావు, పవన్‌కుమార్ స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. సమీక్ష అనంతరం ఈ నెల 3, 4 తేదీల్లో వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్ మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో వరుసగా పర్యటించారు. కాల్వ నిర్మాణంలో ఇళ్లు కోల్పోతున్న వారికి ఆర్ అండ్‌ఆర్ జాబితా పీడీఎఫ్‌లపై క్షేత్రస్థాయిలో ఇంటింటి సర్వే చేశారు. ఇటీవల రత్నంపేట గ్రామంలో పలువురు భూ నిర్వాసితులకు చెక్కులు సైతం అందించారు. ప్రతిబంధకాలు చాలా ఉన్నప్పటికీ వాటిని క్లియర్ చేసేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. భూనిర్వాసితులకు పరిహారం అందించేందుకు గాను మరో 35 చెక్కులు అధికారుల వద్ద సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. మెజార్టీ చెక్కుల పంపిణీ చేసి కాల్వ పనులు మొదలు చేయాలని భావిస్తున్నారు. ఇప్పటి వరకు సుమారు పది చెక్కుల పంపిణీ చేసినట్లు తెలిసింది. ఈ చర్యలతో కొద్ది నెలలుగా స్తబ్ధంగా ఉన్న అదనపు టీఎంసీ పనుల్లో ఇద్దరు ఆర్డీవోల సమీక్ష, రైతులకు చెక్కుల పంపిణీలతో మళ్లీ కదలిక తెచ్చింది.

➡ కరీంనగర్ జిల్లా రామడుగు, గంగాధర మండలాల మీదుగా రాజన్నసిరిసిల్ల బోయినపల్లి మండలం వరదవెల్లి క్రాస్ రెగ్యులేటర్ వరకు 23 కిలోమీటర్ల మేర అదనపు టీఎంసీ వరద కాల్వ నిర్మించనున్నారు.

➡ విలాసాగర్ రెవెన్యూ గ్రామం నుంచి వరదవెల్లి రెవెన్యూ గ్రామ శివారు వరకు ఆరు కిలోమీటర్ల మేర వరద కాల్వ నిర్మాణంలో సుమారు 190 ఎకరాల మేర వ్యవసాయ భూమి ముంపునకు గురికానుంది.

➡ విలాసాగర్ రెవెన్యూ గ్రామ పరిధిలో సుమారు 165.15 ఎకరాలు, వరదవెల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో సుమారు 20.38 ఎకరాల మేర రైతుల వ్యవసాయ భూమి ముంపునకు గురికానున్నట్లు అధికారులు తెలిపారు.

కోర్టు కేసులు లేని చోట్ల పనులు

అదనపు టీఎంసీ వరద కాల్వ నిర్మాణంలో మండలంలోని విలాసాగర్, వరదవెల్లి రెవెన్యూ గ్రామాల పరిధిలో సూమారు 190 ఎకరాల మేర భూమి ముంపునకు గురవుతుంది. ఈ క్రమంలో పరిహారం నచ్చక కొందరు రైతులు కోర్టును ఆశ్రయించారు. కోర్టు కేసులతో సంబంధం ఉన్న వాటి జోలికి వెళ్లకుండా ఉండాలని అధికారులు భావిస్తున్నారు. మొదటగా కోర్టు కేసులు లేకుండా ఎంజాయ్‌మెంట్ సర్వేకు సహకరించి పరిహారం పొందిన రైతుల భూముల్లో వరద కాల్వ నిర్మాణం పనులు చేపట్టాలని అధికారులు నిర్ణయించినట్లు తెలిసింది. ఈ విషయంలో కోర్టు జోక్యం లేని చోట్ల కాల్వ పనులు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు సమాచారం. ఇప్పటి వరకు వరదవెల్లి రెవెన్యూ గ్రామ పరిధిలో సుమారు 96 ఎకరాల మేర ఎంజాయ్‌మెంట్ సర్వే పూర్తి చేశారు. అలాగే పెద్ద మొత్తంలో రైతులకు పరిహారం సైతం అందించారు. కాగా మోఖాపై ఉన్న ఫ్లక్కర్లలో తేడాలతో కొందరు పరిహారం చెక్కులు తీసుకోవడం లేదు. ఇలాంటి వారిపై రెవెన్యూ అధికారులు శ్రద్ధ తీసుకుని సరి చేస్తున్నారు. కాగా మెజార్టీగా సుమారు 92 ఎకరాల భూమి విలాసాగర్ గ్రామంలో ఎంజాయ్‌మెంట్ సర్వే చేయాల్సి ఉంది. ఇక్కడి రైతులు భూసేకరణ వద్దని రిలే దీక్షలు చేశారు. అలాగే అదనపు టీఎంసీ భూసేకరణ నిలుపుదల చేయాలని కోర్టును ఆశ్రయించారు. ఈ మేరకు విలాసాగర్ గ్రామంలో ఇప్పటివరకు అదనపు టీఎంసీ పనుల ఊసే లేదు.

ఎల్‌ఏవోగా వేములవాడ ఆర్డీవో

అదనపు టీఎంసీ వరదకాలువ భూసేకరణ అధికారి(ఎల్ఏవో)గా వేములవాడ ఆర్డీవో పవన్ కుమార్‌ను కలెక్టర్ అనురాగ్‌జయంతి ఇటీవల నియమించారు. ఆర్డీవోగా లీల పనిచేసిన సమయంలో గతేడాది ఆగస్టులో కలెక్టర్ అనురాగ్‌జయంతి ఎల్‌ఏవోగా సిరిసిల్ల ఆర్డీవో శ్రీనివాసరావును నియమించారు. మళ్లీ ఇప్పుడు వేములవాడ ఆర్డీవో పవన్‌కుమార్‌కే ఆ బాధ్యతలను అప్పగించారు. కొత్త ఎల్ఏవో సారథ్యంలో అదనపు టీఎంసీ పనుల్లో వేగం పెంచాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. కాగా అదనపు టీఎంసీ పనుల ప్రారంభమైన సమయం నుంచి ఇప్పటి వరకు ముగ్గురు తహసీల్దార్లు, ఒక ఆర్డీవో బదిలీ కావడం కొసమెరుపు.

దద్దరిల్లిన మండల సర్వసభ్య సమావేశం

- భూముల అన్యాక్రాంతంపై బీజేపీ ఎంపీటీసీలు నిరసన
- నల్లా చొక్కాలు ధరించి ప్లకార్డులతో ధర్నా
- అరెస్టు చేసి సమావేశం నుంచి లాక్కెళ్లిన పోలీసులు


వాగ్వాదానికి దిగిన బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు


బీజేపీ ఎంపీటీసీలను అరెస్టు చేస్తున్న పోలీసులు

తంగళ్లపల్లి: బీజేపీ, బీఆర్‌ఎస్ నాయకుల మధ్య మాటల తూటాలతో తంగళ్లపల్లి మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం దద్దరిల్లింది. శుక్రవారం ఎంపీపీ పడిగెల మానస అధ్యక్షతన స్థానిక మార్కండేయ ఫంక్షన్ హాలులో సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ప్రభుత్వ, దేవుడి భూములు అన్యాక్రాంతమయ్యాయని, వాటిలో అధికార పార్టీ నాయకుల ప్రమేయముందని ఆరోపిస్తూ బీజేపీ ఎంపీటీసీలు బైరినేని రాము, రాగుల రాజిరెడ్డి నల్ల చొక్కాలు ధరించి ప్లకార్డులు ప్రదర్శిస్తూ సమావేశ మందిరంలో బైఠాయించారు. అనంతరం మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన నాయకులు మండెపల్లిలో శ్రీరామాలయం భూమిని, దళిత మహిళకు చెందిన ఐదెకరాల భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారని ఆరోపించారు. వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీంతో బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, బీజేపీ ఎంపీటీసీలపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిపైకి దూసుకెళ్లగా ఇరువర్గాలకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో రూరల్ సీఐ ఉపేందర్ పోలీస్ సిబ్బందితో వచ్చి బీజేపీ ఎంపీటీసీలను బలవంతంగా అరెస్టు చేసి లాక్కెళ్లారు.

విషమివ్వండి తాగి సచ్చిపోతం

అనంతరం సమావేశం ప్రారంభమైంది. కంటి వెలుగుకు సర్పంచులు సహకరించాలని కోరగా, సర్పంచులకు విషమిస్తే తాగి సచ్చిపోతామని చింతలఠాణా సర్పంచ్ ఈసరి ఉమరాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంతవరకు చేసిన పనులకే బిల్లులు రావడం లేదని ఇప్పుడు ఈ కార్యక్రమం ఏర్పాట్లు చేయాలంటే తమ వల్లకాదని తేల్చి చెప్పారు. రాళ్లపేటలో క్రషర్ నిబంధనలు విరుద్ధంగా నిర్వహిస్తున్నారని సర్పంచ్ పర్శరాములు ఆరోపించారు. ప్రాథమిక పాఠశాలలో ఒకే టీచర్ ఉన్నారని, మరొకరు లీవ్‌లో వెళ్లడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని సర్పంచ్ తెలిపారు. తహసీల్దార్ పి.సదానందం మాట్లాడుతూ ఇనాం భూములు రద్దు అయ్యాయని, నిరసన తెలిపిన భూముల్లో రికార్డులను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. వైస్ఎంపీపీ అంజయ్య, సింగిల్‌విండో చైర్మన్లు దేవదాస్‌గౌడ్, భాస్కర్‌గౌడ్, ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు రాజిరెడ్డి, ఎంఈవో రఘుపతి, జిల్లా సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మధు, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు వేణుగోపాలరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకోవాలి


ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: మండల కేంద్రంలోని మార్కండేయ ఫంక్షన్ హాలులో జరుగుతున్న మండల సర్వసభ్య సమావేశం ఎదుట శుక్రవారం కాంగ్రెస్ నాయకులు ప్లకార్డులతో బైఠాయించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాలగం ప్రవీణ్ (టోని) మాట్లాడుతూ అధికార పార్టీ నాయకుల ఆగడాలకు హద్దూ అదుపు లేకుండా పోయిందని, విచ్చలవిడిగా ప్రభుత్వ భూములు, దేవుడి భూములు కబ్జా చేశారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని బాధిత దళిత మహిళకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎంపీడీవో పి.లచ్చాలుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గుగ్గిళ్ల శ్రీకాంత్‌గౌడ్, మునిగెల రాజు, చుక్క రాజశేఖర్, గడ్డం మధుకర్, అభినయ్ గౌడ్, అరెపల్లి బాలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా ధనుర్మాస ఉత్సవాలు


కోలాటం ఆడుతున్న మహిళలు

ఎల్లారెడ్డిపేట: స్థానిక శ్రీవేణుగోపాలస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గోదాదేవీకి సారె సమర్పించే కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. మహిళలు దారి పొడువునా కోలాటం, బతుకమ్మ ఆటలతో ఆకట్టుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నంది కిషన్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, సభ్యులు నర్సయ్య, ఆంజనేయులు, ఈశ్వర్, పద్మారెడ్డి, రమేశ్, నర్సయ్యపాల్గొన్నారు.

గోశాలకు రాజన్న కోడెలు

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న తిప్పాపూర్ గోశాలలోని కోడెలను వరంగల్ జిల్లా రాయపర్తి మండలం జింకురామ్ తండాకు చెందిన శ్రీ బాలజీ గోశాలకు 20 కోడెలను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్, నరసింహమూర్తి, శ్యామ్, శంకర్ పాల్గొన్నారు.

సరస్వతీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ


భూమిపూజ చేస్తున్న సర్పంచ్ అరుణ

కోనరావుపేట: మండలంలోని ధర్మారం ఉన్నత పాఠశాలలో సరస్వతీ మాత విగ్రహ నిర్మాణానికి సర్పంచ్ గున్నాల అరుణ శుక్రవారం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు.

దేవాలయాల సందర్శన


పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కళ

సిరిసిల్లటౌన్: సిరిసిల్ల పట్టణంలో ఈనెల 21న నిర్వహించే గంగమ్మ, మడేలేశ్వర స్వామి, రామప్ప జాతరల నేపథ్యంలో ఆయా ఆలయాల్లో ఏర్పాట్లపై మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ శుక్రవారం సందర్శించారు. మున్సిపల్ కమిషనర్ సమ్మయ్య, వైస్ చైర్మన్ శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

పవర్ కట్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బోయినపల్లి: మండల కేంద్రంతో పాటు విలాసాగర్, వెంకట్రావుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సెస్ ఏఈ రాకేశ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ ఫీడర్ మరమ్మతు పనుల సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మార్కండేయ జయంతికి భారీ ఏర్పాట్లు


సమావేశమైన కార్యవర్గం

సిరిసిల్లకల్చరల్: పద్మశాలీల కులదైవం శ్రీ మార్కండేయ స్వామి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పద్మశాలీ సంఘం పట్టణాధ్యక్షుడు గోలి వెంకటరమణ తెలిపారు. శుక్రవారం సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ వేడుకల్లో భాగంగా ఏడు రోజులపాటు ఒక్కో దేవాలయంలో ఒక్కో రోజు యాగ నిర్వహణ చేయాలని నిర్ణయించారు. ఈ నెల 24న ఆలయంలో మార్కండేయ మహాయాగాన్ని, పూర్ణాహుతి, సాయంత్రం శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సంఘం కార్యదర్శి మండల సత్యం, కోశాధికారి కోడం శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గాజుల బాలయ్య, మోర రవి, సహాయ కార్యదర్శి రాపెల్లి ప్రవీణ్, యెల్లె ఎల్లప్ప, మహిళా సంఘం అధ్యక్షురాలు కాముని వనిత పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పదిరలో శుక్రవారం డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణానికి జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, ఎంపీపీ పిల్లి రేణుక శుక్రవారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కుంబాల వజ్రమ్మ, వైస్ఎంపీపీ భాస్కర్‌గౌడ్, ఎంపీటీసీ మల్లేశం, సింగిల్‌విండో చైర్మన్ కృష్ణారెడ్డి, ఎమ్మార్వో జయంత్‌కుమార్, పీఆర్‌డీఈ శ్రీనివాస్, ఏఈ రవీంద్రనాథ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ వినయ్, నాయకులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని అనంతారం గ్రామంలో శుక్రవారం 20 డబుల్ బెడ్రూం ఇళ్లకు సర్పంచ్ చల్ల నారాయణ భూమిపూజ చేశారు. వీటిలో 16 దళితులకు, మిగతా నాలుగు ఇళ్లు ఇతర కులస్తులకు మంజూరైనట్లు పేర్కొన్నారు. ఎంపీటీసీ పుష్పలత, ప్రభాకర్, లక్ష్మి, లావణ్య, ఎల్లయ్య పాల్గొన్నారు.

జర్నలిస్టుల మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

సిరిసిల్లక్రైం: తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్(టీయుడబ్ల్యూజే-ఏ143) రాష్ట్ర ద్వితీయ మహాసభ పోస్టర్‌ను ఎస్పీ రాహుల్‌హెగ్డే శుక్రవారం ఆవిష్కరించారు. ఈనెల 8న పఠాన్‌చెరువులోని జీఎంఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ఈ మహాసభ నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర ఉపాధ్యక్షుడు లాయక్‌పాషా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు బిజిగిరి శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాచర్ల లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి తీగల మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో ఇద్దరిపై కేసు

ఎల్లారెడ్డిపేట: మండల కేంద్రం శివారులో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న ఇద్దరి వ్యక్తులపై పోలీసులు శుక్రవారం డ్రంకెన్ డ్రైవ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై శేఖర్ తెలిపారు గతంలో జరిమానాలు విధించిన చెల్లించకుండా తిరుగుతున్న 12 మంది వాహనదారులతో జరిమానాలు కట్టించామన్నారు ఏఎస్సై కిషన్‌రావు, సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడిన వృద్ధుడి మృతి

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేటలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన మ్యాన దశరథం(70) వృద్ధుడు చికిత్స పొందుతూ మృతిచెందాడు. సైకిల్‌పై వెళ్తున్న దశరథంను ద్విచక్రవాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్రగాయాలు కాగా హైదరాబాద్ తరలించగా, చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతుడికి లక్ష్మణ్, మహేందర్ ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబాన్ని వైఎస్ఆర్‌టీపీ జిల్లా అధ్యక్షుడు చొక్కాల రాము పరామర్శించారు.

సంక్రాంతిలోపు క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న కలెక్టర్ అనురాగ్‌జయంతి

సిరిసిల్లఅర్బన్: జిల్లాలో సంక్రాంతిలోపు అన్ని ఆవాసాల్లో తెలంగాణ క్రీడా ప్రగతి ప్రాంగాణాలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి ఎండీవోలను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్‌లో ఆయిల్ పామ్ సాగు, తెలంగాణ క్రీడా పగ్రతి ప్రాంగణాలు, తదితర అంశాల ప్రగతిపై ఎంపీడీవోలు, ఎంపీవోలతో సమీక్షించారు. తెలంగాణ క్రీడా ప్రాంగాణాలను పూర్తి చేయాలని, స్వచ్ఛ సర్వేక్షన్, తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ తదితర వాటి గురించి చర్చించారు. ప్రధానమంత్రి సూక్ష్మ ఆహార ఉత్పత్తి తయారీ సంస్థల క్రమబద్ధీకరణ పథకంలో లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ వినోద్, డీపీవో రవీందర్, జిల్లా పరిశ్రమల అధికారి ఉపేందర్‌రావు పాల్గొన్నారు.

మహిళల అభిరుచి మేరకే బతుకమ్మ చీరలు


బతుకమ్మ చీరల డిజైన్లు పరిశీలిస్తున్న మహిళలు

సిరిసిల్లకల్చరల్: ప్రభుత్వం ఏటా పంపిణీ చేస్తున్న బతుకమ్మ చీరల డిజైన్లను మహిళల మనోభావాలు, అభిరుచులకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నట్లు రాష్ట్ర పవర్‌లూమ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్ పేర్కొన్నారు. పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్‌లో శుక్రవారం బతుకమ్మ చీరల డిజైన్లపై అతివల అభిప్రాయ సేకరణ కోసం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి హాజరైన సుమారు 60 మంది మహిళల అభిప్రాయాలు సేకరించారు. ఆయన మాట్లాడుతూ ఆరేళ్లుగా పంపిణీ చేస్తున్న చీరలను ఏటా కొత్త డిజైన్లలో తయారు చేస్తున్నట్లు వివరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, టెస్కో జీఎం యాదగిరి, జౌళి శాఖ ప్రాంతీయ సంచాలకుడు అశోక్‌రావు పాల్గొన్నారు.

క్రీడాప్రాంగణం ప్రారంభం


క్రీడాప్రాంగణాన్ని ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

ముస్తాబాద్: మండలం తుర్కపల్లిలో తెలంగాణ క్రీడాప్రాంగణాన్ని జెడ్పీటీసీ గుండం నర్సయ్య శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు క్రీడాప్రాంగణాలను అభివృద్ధి చేశారన్నారు. ఎంపీపీ జనగామ శరత్‌రావు, ఆర్‌బీఎస్ అధ్యక్షుడు గోపాల్‌రావు, కార్యదర్శి శ్రీనివాస్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన

వీర్నపల్లి: మండలంలోని భావుసింగ్ తండా, భూక్య తండా, బాబాయిచెరువు తండా గ్రామాల్లో శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీవో నరేశ్‌కుమార్, తహసీల్దార్ యండి తాఫజుల్ హుస్సేన్ కలిసి తెలంగాణ క్రీడా ప్రాంగణం కోసం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యండీ తాఫజుల్ హుస్సేన్, ఆర్ఐ ప్రవీణ్ కుమార్, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆటోస్టాండ్ యథావిధిగా కొనసాగించాలి



వేములవాడఅర్బన్: వేములవాడ ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆటో స్టాండ్‌ను యథావిధిగా కొనసాగించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, డిపో మేనేజర్ కార్యాలయంలో శుక్రవారం వినతిపత్రం అందజేశారు. వేములవాడలోని తిప్పాపూర్ బస్టాండ్, కోరుట్ల బస్టాండ్, జగిత్యాల బస్టాండ్‌లలో ప్రయాణికుల సౌకర్యార్థం, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా ఆటో స్టాండ్‌ల ఏర్పాటుకు స్థలం కేటాయించాలన్నారు. నాయకులు కడారి రాములు, శంకర్, ఆటో కార్మికులు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించాలి


మాట్లాడుతున్న ప్రేమ్‌సాగర్

ఎల్లారెడ్డిపేట: విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేలా ప్రభుత్వం విద్యావిధానాన్ని రూపొందించాలని స్వేరోస్ రాష్ట్ర కోకన్వీనర్ కులేరి ప్రేమ్‌సాగర్ అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గుండారంలో శుక్రవారం సావిత్రి బాయిపూలే జయంతి వేడుకలను నిర్వహించి మహిళా ఉపాధ్యాలను సన్మానించారు. ప్రేమ్‌సాగర్ మాట్లాడుతూ విద్య కొన్ని వర్గాలకే పరిమితం కాదని ఆడ, మగ పిల్లలకు సమానంగా విద్యనందించాలన్నారు. శాస్త్రీయ దృక్పథం లేక సమాజంలో అసమానతలు పెరిగిపోతున్నాయన్నారు. దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలిగా సావిత్రి బాయిపూలే విద్యను నేర్పించిందన్నారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, కవిత, అంజమ్మ, వెంకటలక్ష్మి, పద్మ, లక్ష్మి పాల్గొన్నారు.

నర్సరీల పరిశీలన

ఇల్లంతకుంట: మండలంలోని కేశన్నపెల్లి, పత్తికుంటపల్లి గ్రామాల్లో హరిత నర్సరీలను శుక్రవారం ఏపీవో చంద్రయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జూన్‌లో చేపట్టబోయే 9వ విడత హరితహారం కోసం మొక్కలను సిద్ధం చేయాలని సూచించారు.

ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి పరామర్శ

వేములవాడ: పుత్రశోకంతో బాధపడుతున్న ఏఎంసీ మాజీ చైర్మన్ అయిల్నేని సుధాకర్‌రావును ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. ఆయన వెంట డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ ఉన్నారు.

సెస్ వైస్ చైర్మన్‌కు పరామర్శ

కోనరావుపేట: మాతృవియోగంతో బాధపడుతున్న సెస్ వైస్‌చైర్మన్ దేవరకొండ తిరుపతిని రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి శుక్రవారం పరామర్శించారు. కథలాపూర్ జెడ్పీటీసీ భూమయ్య, ఏఎంసీ చైర్మన్ నాగేశ్వర్‌రావు, సింగిల్‌విండో చైర్మన్ బండ నర్సయ్య పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ముస్తాబాద్: మండలం గూడూరులో బాధిత కుటుంబాలకు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చీటి వెంకటనర్సింగరావు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు.

సిరిసిల్లఅర్బన్: 34వ వార్డులో లబ్ధిదారులకు కౌన్సిలర్ దార్లకీర్తన సందీప్ సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. వార్డుకు చెందిన లావణ్య రూ.20 వేలు, కె.దీప్తి రూ.45 వేలు, వేముల గణేశ్ రూ.36,500, గద్దె శివకుమార్‌లకు రూ.60 వేల విలువగల చెక్కులను పంపిణీ చేశారు.

ఎంపీ సంతోష్‌కుమార్‌ను కలిసిన జెడ్పీటీసీ

బోయినపల్లి: రాజ్యసభ సభ్యుడు జోగినిపల్లి సంతోష్‌కుమార్‌ను శుక్రవారం జెడ్పీటీసీ కత్తెరపాక ఉమ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కత్తెరపాక కొండయ్య ప్రగతిభవన్‌లో కలిశారు.

బదిలీలు అనివార్యం

సిరిసిల్లఎడ్యుకేషన్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీ సర్వసాధారణమని డీఈవో రాధాకిషన్ అన్నారు. జిల్లాలో సైన్స్ ఆఫీసర్‌గా విధులు నిర్వహించి బదిలీపై కరీంనగర్‌కు వెళ్తున్న వంతడుపుల ఆంజనేయులను శుక్రవారం సిరిసిల్లలోని శివనగర్ ప్రభుత్వ పాఠశాలలో సన్మానించారు. ఏడున్నర ఏళ్లుగా జీవశాస్త్ర ఉపాధ్యాయునిగా, డీఎస్వోగా పనిచేసిన వంతడుపుల ఆంజనేయులు కృషి విద్యార్థులు రాష్ట్ర, జాతీయస్థాయి సైన్స్ పోటీల్లో జిల్లా పేరును నిలిపారన్నారు. హెచ్ఎంలు ఎన్వీ ప్రభావమూర్తి పాల్గొన్నారు.

జీవన ఎరువులు వాడకంపై అవగాహన



బోయినపల్లి: మండలంలోని జగ్గారావుపల్లి గ్రామంలో రైతులకు శుక్రవారం జీవన ఎరువుల వాడకంపై ఎంఏవో ప్రణిత అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రజిత, రైతులు పాల్గొన్నారు.

డీఎస్పీకి సన్మానం



వేములవాడ: వేములవాడ శివదీక్షా సేవా సమితి ఆధ్వర్యంలో డీఎస్పీ నాగేంద్రచారిని శుక్రవారం సన్మానించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి, సెస్ డైరెక్టర్ ఉమ, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.